# ప్రేరణ

పద్నాలుగు సంవత్సరాల బాలుడు పార్ధు ఆ నేరం చేశాడంటే నమ్మలేకపోయింది లాయర్ భారతి.

ముక్కుపచ్చలారని బాలుడుమీద నీచమైన ఆరోపణలు-అపనిందలు-ఏమిటీ సమాజం అని విసుక్కుంది.

ఆదివారం - తీరికగా వుండటంవలన పక్కవీధిలోని లావణ్య ఇంటికి బయలుదేరింది కలతబారిన మనసుతో.

లావణ్య చాలా విషాదంలో మునిగిపోయి వుంది.

"లావణ్యా ! చాలా డల్‌గా వున్నావు !" అనుమానంగా అడిగింది.

"కలియుగాంతం దగ్గరికి వచ్చిందాని అనుమానంగా వుంది"

"ఏం జరిగింది?"

"అభంశుభంతెలియని పాప బిందును క్లాసులో కొట్టికొట్టి చంపేశారు... అంతేకాదు... ఆ పాపని చెరిచారు. ఇదంతా ఎవరో చెయ్యలేదు-ఆపాపతోటి క్లాస్‌మేట్లు... సహవిద్యార్థులు చేశారు" లావణ్య కళ్ళు చెమర్చాయి.

"పార్ధు వున్నాడా ఆ గ్యాంగులో?" హీనస్వరంతో అడిగింది.

"ఆ ! వాడే ముఖ్యుడు - వాడే చెరిచింది... ఆపాప అరిచేసరికి భయపడి... నలుగురూ కలసి కట్టెతో కొట్టి చంపేశారు". లావణ్య వణుకుతూ చెప్పింది.

"పార్ధు నాకుతెల్సు - కానీ వాడు అంత క్రిమినల్‌కాదు... వాడిమీద ఎవరో నిందలు వేశారనుకుంటున్నాను". అంది భారతి.

"భారతీ ! మిగతా ప్రజలు అంత తెలివి తక్కువ దద్దమ్మలనా నువ్వు అనుకునేది... పోలీసులు ఆ నలుగురిని కస్టడీలోకి తీసుకున్నారట!."

ఇంక భారతి అక్కడ నిలబడలేకపోయింది. పార్ధును వెతుక్కుంటూ వచ్చింది. అతడి అమాయక మొహం ఆమెని వెంటాడింది. చక్కగా స్వచ్ఛంగా నవ్వుతూ వుండే అతడ్ని చూస్తే తనకు తమ్ముడులేడనే కొరత తీరేది!

ఒక గదిలో నలుగురు పిల్లలూ కూర్చునున్నారు. గదిముందు ఓ పోలీసు కాపలా వున్నాడు.

భారతి తన గురించి చెప్పుకుని పోలీసు దగ్గర పర్మిషన్ తీసుకుని పార్ధును ఒక గదిలోకి పిలిపించింది.

"ఆంటీ! నన్ను విడిపించడానికి వచ్చావా?" పార్థు ఆశగా అడిగాడు.

"పార్థూ! నిజం చెప్పు-నువ్వు తప్పుచేశావా?" సూటిగా అడిగింది.

పార్థు తల వంచుకున్నాడు - ఆమె కళ్ళల్లోకి చూడలేక.

"నీకేం భయంలేదు. ధైర్యంగా నిజం చెప్పు-అసలేం జరిగింది?"

"ఆంటీ! నాకేంతెలీదు. వాడు అరుణ్‌గాడు థ్రిల్ చూపిస్తానని క్లాసుకు తీసుకువచ్చాడు. అక్కడ ప్రైవేట్ క్లాసుందనుకుని బిందువచ్చి కూర్చునుంది. జానీ, యాకూబ్‌లుకూడావున్నారు. నన్ను బిందును 'కిస్' చెయ్యమన్నాడు. రెచ్చగొట్టాడు. నేను ఆపని చెయ్యగానే అదినన్ను కొట్టింది... ఆ పర్వాత..." ఏడుస్తూ చెప్పలేకపోయాడు.

"సరే... ఆ బిందును పంపించెయ్యచ్చుగా?" అంది భారతి.

"అది అందరితో చెప్పి గొడవ చేస్తానంది... మమ్మల్ని డిబార్ చేయిస్తానంది. అందుకని..." మాటలు మింగాడు పార్థు.

ఆవేశం పట్టలేని భారతి ఫెడిల్‌మని చెంపమీద కొట్టింది పార్థును.

"మీ తల్లిదండ్రులు ఎంత కష్టపడి సంపాదించి-నీకు ఫీజులుకట్టి చదువుకోమని స్కూలుకు పంపిస్తూవుంటే మీరు నేర్చుకుంటున్నది ఇదా? అస్సలు మీకు ఇటువంటి వెధవ ఆలోచనలు ఎక్కడ్నించి వస్తున్నాయి?" అంటూ రౌద్రంగా అడిగింది.

"మేం నలుగురం - టీ.వీ. సీరియల్స్ ఇంట్రెస్టింగ్‌గా చూస్తూవుంటాం. రోజూ వాటిగురించి ఆలోచిస్తూ.వుంటాం. జీవితంలో ఒక అడ్వెంచర్ చేయాలనుకున్నాం..." అంటూ తను చూసిన సీరియల్స్ గురించి చెప్పుకుపోయాడు.

కొన్నాళ్ళకు ఆ కేసు జువెనైల్ కోర్టుముందుకు వచ్చింది.

భారతి కేసు టేకప్ చేసింది.

"యువరానర్! ముక్కుపచ్చలారని ఈపసిపిల్లలు ఈ నేరం చేయటానికి మూలకారణం టీ.వీ.! నేరం చేసినవాడు ఎంత నేరస్థుడో నేరం చేయమని ప్రోత్సహించేవాడు అంతకంటే ఎక్కువ నేరస్థుడు. ఈరోజు ఈ నలుగురిని అరెస్టుచేసి జైల్లో పెట్టడంవలన జరుగబోయే నేరాలు ఆగవు. మన చుట్టూవున్న సమాజం కలుషితమై పోతున్నది.

ముఖ్యంగా టీ.వీ.వలన చదువురాని వారికి కూడా పసిపిల్లలకు కూడా విచక్షణాజ్ఞానం నశించిపోతున్నది. నేరం చెయ్యడం తప్పు అని చివరిలో చిన్న నీతి చూపించడానికి ఈ సీరియల్స్ చేస్తున్న పనేంటి?

ముందు నేరస్థుడు-వాడు చేస్తున్న నేరాల్ని ఎంత గొప్పగా-ఆరకర్షణీయంగా చిత్రీకరిస్తున్నాయి...

ఇవన్నీ చూశాక చివరిలో చూపించే నీతి ఎవరికి గుర్తుంటుంది. కాబట్టి యువరానర్-ఈ టీ.వీ. సీరియల్స్ మీదకూడా యాక్షన్ తీసుకోమని కోరుతున్నాను!" భారతి ఆవేశంగా చెప్పింది.

చప్పట్లు మోగాయి.

(స్వాతి వార పత్రిక 27-6-1997)